క్లుప్తంగా

బకాయి జీతాలు చెల్లించాలి



నినాదాలు చేస్తున్న పంచాయతీ కార్మికులు

ఏలూరు (టూటౌన్): ఏలూరు రూరల్ మండలం జాలిపూడి పంచాయతీ కార్మికుల బకాయి జీతాలు వెంటనే చెల్లించాలని ఏపీ గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) డిమాండ్ చేసింది. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో శుక్రవారం ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస డాంగే అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. యూనియన్ జిల్లా కార్యదర్శి పి.కిషోర్ మాట్లాడుతూ జాలిపూడి పంచాయతీ సిబ్బందికి గత నాలుగు నెలలుగా జీతాలు చెల్లించడం లేదన్నారు. కార్మికులకు బకాయి జీతాలు చెల్లించని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. పంచాయతీ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పీఎఫ్, ఈఎస్ఐ కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పారిశుద్ధ్య కార్మికులకు కొబ్బరినూనె, చెప్పులు, చేతి గ్లౌజులు, యూనిఫామ్ తదితర సౌకర్యాలు కల్పించాలని కోరారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బస్సుల రద్దీతో ప్రయాణికుల అవస్థలు


కొయ్యలగూడెం బస్‌స్టాండ్‌లో ప్రయాణికులతో రద్దీగా ఉన్న బస్సు

కొయ్యలగూడెం: వరుస సెలవుల నేపథ్యంలో ప్రయాణికులు తమ గమ్యస్థానం చేరుకోవడానికి శుక్రవారం ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ముఖ్యంగా వరలక్ష్మీ వ్రతం కావడంతో మహిళలు అత్యధికంగా ప్రయాణాలు చేశారు. అయితే రద్దీకి సరిపడా బస్సులు లేకపోవడంతో బస్టాండ్ వద్ద వేచి చూడాల్సి వచ్చింది. మూడు రోజుల పాటు సెలవుల నేపథ్యంలో విద్యార్థులైన పిల్లలతో వెళ్లడానికి సకాలంలో బస్సులు లేకపోవడంతో ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వచ్చింది. కాగా కొన్ని బస్సుల్లో సుదూరంగా ప్రయాణించే వారిని మాత్రమే కండక్టర్లు ప్యాసింజర్ సర్వీసుల్లో ఎక్కించుకున్నారని దీని వలన మరింత రద్దీ ఏర్పడడానికి కారణం అయ్యిందని ప్రయాణికులు అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన బస్సులు అయితే కేవలం పట్టణాలకు వెళ్లే వారిని మాత్రమే ఎక్కించుకున్నారని మహిళలు వాపోయారు.

కళావిహీనంగా వాటర్ ఫౌంటెయిన్లు

- నిర్వహణలో నిర్లక్ష్యం
- నగరంలో ప్రారంభించిన నెలరోజులకే పనిచేయని వైనం
- ప్రజాధనం వృథా అంటూ వెల్లువెత్తుతున్న విమర్శలు


జూట్ మిల్లు సెంటర్ వద్ద ఉన్న వాటర్ ఫౌంటెయిన్


తంగెళ్లమూడి వద్ద వాటర్ ఫౌంటెయిన్


అశోక్‌నగర్ సెంటర్‌లోని వాటర్ ఫౌంటెయిన్

ఏలూరు (టూటౌన్): స్వచ్ఛ ఏలూరులో భాగంగా నగరంలో నిర్మించిన వాటర్ ఫౌంటెయిన్లు కళావిహీనంగా దర్శనమిస్తున్నాయి. లక్షలాది రూపాయల ప్రజాధనంలో ఏర్పాటుచేసిన వీటి నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా అవి పనిచేయడంలేదు. ఇందుకు జూట్‌మిల్లు సెంటర్, అశోక్ నగర్ సెంటర్, తంగెళ్లమూడి సెంటర్లలో కొద్ది నెలల క్రిందట ఏర్పాటు చేసిన వాటర్ ఫౌంటెయిన్లే ఉదాహరణ. వీటి పర్యవేక్షణ విషయంలో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగానే వాటర్ ఫౌంటెయిన్లు కళ తప్పాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రజాధనం వృథా

ఏలూరు జూట్‌మిల్లు సెంటర్, తంగెళ్లమూడి, అశోక్ నగర్ సెంటర్ల ప్రాంతాల్లో రాతి విగ్రహాలు, బొమ్మలు వంటివి ఏర్పాటు చేసి చుట్టూ గ్రానైట్ రాళ్లు పరిచారు. లోపల వాటర్ ఫౌంటెయిన్‌లు ఏర్పాటు చేశారు. ఒక్కో వాటర్ ఫౌంటెయిన్ నిర్మాణానికి రూ.30 లక్షలు చొప్పున మూడు ఫౌంటెయిన్లకు మొత్తం రూ.90 లక్షల ప్రజా ధనం వెచ్చించారు. ఇంత ఖర్చు చేసి ఏర్పాటు చేసిన ఈ ఫౌంటెయిన్‌లు నెల తిరక్కుండానే పనిచేయకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నిర్వహణ గాలికి

ఈ వాటర్ ఫౌంటెయిన్లు నిర్వహణను అధికారులు, సిబ్బంది గాలికి వదిలేశారంటూ ప్రజలు విమర్శిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో సిబ్బంది తమకు గుర్తుకు వచ్చినప్పుడు వాటర్ ఫౌంటెయిన్‌ల వద్ద మోటార్లు ఆన్ చేసి నీరు పైపుల ద్వారా వెదజల్లే విధంగా చేస్తున్నారు. రోజులో ఒక గంట కూడా ఇవి పనిచేయడం లేదు. కొన్నిచోట్ల అయితే ఆ గంట సమయం కూడా వాటర్ పైపులు పనిచేయడం లేదని స్థానికులు చెబుతున్నారు. తాజాగా అయితే వీటి సంగతి పట్టించుకునే వారే కరువయ్యారని వాపోతున్నారు.

చెత్త రహిత నగరంగా తీర్చిదిద్దాలి



ఏలూరు నగరాన్ని చెత్త రహితంగా తీర్చి దిద్దాలి. నగర జనాభాకు అనుగుణంగా కార్పొరేషన్ పరిధిలో పారిశుద్ధ్య కార్మికులను నియమించాలి. ఒక పక్క క్లాప్ ఆటోలను నిలిపి వేయడంతో ఎక్కడి చెత్త అక్కడే దర్శనమిస్తోంది. నగరంలో ఇన్ని సమస్యలు ఉండగా సుందరీకరణ పేరుతో పెద్ద మొత్తంలో ప్రజాధనాన్ని వృథా చేయడం సరికాదు.

– డీఎస్‌వీడీ ప్రసాద్, సీపీఎం నగర కార్యదర్శి, ఏలూరు

ప్రజా సమస్యలు గాలికి వదిలేశారు



నగరంలో ఉన్న అనేక సమస్యలను పట్టించుకోవడం లేదు. ఎవరి మెప్పు కోసమో, కాంట్రాక్టర్లు ఇచ్చే కాసుల కోసమో సుందరీకరణ పేరుతో లక్షలాది రూపాయల ప్రజా ధనం ఖర్చు చేశారు. మా కార్యాలయం ఎదురుగా ఉన్న జూట్ మిల్లు సెంటర్‌లోని వాటర్ ఫౌంటెయిన్ గతంలో అప్పుడప్పుడో పనిచేసేది. ఇప్పుడు పనిచేయడమే మానేసింది.

– బద్దా వెంకట్రావు, ఐఎఫ్టీయూ ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా

కమీషన్ల కోసమే పనులు



సుందరీకరణ పనులు అన్నీ కమీషన్ల కోసమే చేసేవి తప్ప ప్రజలకు ప్రయోజనం కలిగించేవి కావు. పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛ ఆంధ్ర, చెత్త రహిత ఏలూరు నగరం పేరుతో కార్పొరేషన్ పరిధిలో పలు పనులు చేపట్టడం వరకు బాగానే ఉన్నా. చేపట్టిన పనులను పర్యవేక్షించడంలో అలసత్వం కన్పిస్తుంది. ఇప్పటికైనా నష్ట నివారణ చర్యలు చేపట్టాలి.

– బండి వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ నాయకులు, ఏలూరు

యువతకు ఉచిత శిక్షణ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ సత్రంపాడులో వివిధ అంశాల్లో యువతకు ఉచిత శిక్షణ ఏర్పాటు చేసినట్టు ఆ సంస్థ డైరెక్టర్ ఎం ఫణి కిషోర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 18 నుంచి సీసీ టీవీ కెమెరా రిపేరింగ్‌పై 13 రోజులు (పురుషులకు), పుట్టగొడుగుల పెంపకంపై 10 రోజులు (మహిళలు, పురుషులకు), బ్యూటీ పార్లర్ మెళకువలపై 31 రోజులు (మహిళలకు) శిక్షణ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. శిక్షణ సమయంలో భోజనం, హాస్టల్ వసతి ఉచితమని, శిక్షణ పూర్తి చేసిన వారికి ఉచితంగా టూల్ కిట్టు ఇస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు ఫోన్ నంబర్లు 99485 65256, 95027 23561లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

చింతలపూడి ఎత్తిపోతలను పూర్తిచేయాలి

ఏలూరు (టూటౌన్): చింతలపూడి ఎత్తిపోతల పథకంతోనే జిల్లాలో మెట్ట ప్రాంతం అభివృద్ధి చెందుతుందని మార్క్సిస్ట్ మేధావి, దారి దీపం ప్రధాన సంపాదకులు డీవీవీఎస్ వర్మ పేర్కొన్నారు. స్థానిక స్ఫూర్తి భవనంలో సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఏలూరు జిల్లా సమగ్ర అభివృద్ధిపై శుక్రవారం మన్నవ కృష్ణ చైతన్య అధ్యక్షత ఏర్పాటు చేసిన సదస్సులో వర్మ మాట్లాడారు. జిల్లాలో చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తి చేయడం ద్వారా ఆయకట్టు స్థిరీకరణతో పాటు తాగునీరు, సాగునీరు పుష్కలంగా లభిస్తుందన్నారు. కొల్లేరు సరస్సును కబ్జా కోరల నుంచి రక్షించాల్సి ఉందని తెలిపారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, సీపీఐ రాష్ట్ర, జిల్లా నాయకులు డేగా ప్రభాకర్, చలసాని వెంకట రామారావు, బండి వెంకటేశ్వరరావులు మాట్లాడారు. సీపీఐ, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య, వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా వరలక్ష్మీ వ్రతం


ప్రత్యేక అలంకరణలో పవర్‌పేట కాశీ అన్నపూర్ణమ్మ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : శ్రావణ మాసం రెండవ శుక్రవారం సందర్భంగా నగరంలో వరలక్ష్మీ వ్రతాలను మహిళలు వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామునే లేచి తల స్నానాలు ఆచరించి, పిండి వంటలు సిద్ధం చేసుకుని అమ్మవార్లకు పూలు, బంగారు ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం వరలక్ష్మీ వ్రత మహత్యం కథ చదివి, కుటుంబ సభ్యులకు వినిపించి అమ్మవార్లకు నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. అమ్మవారికి పిండివంటలు నివేదించి, చేతులకు తోరాలు కట్టుకున్నారు. అమ్మవార్ల ప్రసాదాలు తమ చుట్టపక్కల నివాసితులకు పంపిణీ చేశారు. సాయంత్రం పేరంటాలు నిర్వహించి వచ్చిన ముత్తైదువలకు ప్రసాదాలతో పాటు చిరుబహుమతులు అందజేశారు. అమ్మవార్ల ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. అమ్మవార్లకు విశేష అలంకరణలు చేశారు. లలితాసహస్రనామ పారాయణలు, మణిద్వీప వర్ణన పారాయణలు నిర్వహించారు. పత్తేబాద శ్రీ కనకదుర్గమ్మ, పవర్‌పేట శ్రీ కాశీ అన్నపూర్ణమ్మ, బావిశెట్టివారి పేట శ్రీ కనకదుర్గమ్మ ఆలయాల్లో అర్చకులు ప్రత్యేక పూజలు చేయగా కార్యనిర్వహణాధికారులు, ఆలయ అభివృద్ధి కమిటీల ప్రతినిధులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

12న నులిపురుగుల నివారణ దినోత్సవం

దెందులూరు : ఈనెల 12న నులిపురుగుల నివారణ దినోత్సవం నిర్వహించనున్నట్టు చాటపర్రు పీహెచ్‌సీ వైద్యాధికారులు జి.కృష్ణ ప్రదీప్ చంద్ర తెలిపారు. శుక్రవారం ఆయన చాటపర్రు పీహెచ్‌సీలో మాట్లాడుతూ రెండేళ్ల నుంచి 19 ఏళ్ల వయసులోపు ఉన్న విద్యార్థులందరికీ నులిపురుగుల నివారణ టాబ్లెట్లను వైద్య సిబ్బంది అందజేస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కొక్కెర వ్యాధి.. టీకాతోనే కట్టడి

- వ్యాధి సోకితే నాటు కోళ్లు మృత్యువాత
- టీకాలు వేయించాలని సూచిస్తున్న పశు వైద్యులు



జంగారెడ్డిగూడెం : గ్రామీణ ప్రాంతాల్లో నాటు కోళ్ల పెంపకం అనాదిగా వస్తోన్న సాంప్రదాయం. పల్లెల్లో ప్రతి ఇంటికీ 10కి తక్కువ కాకుండా నాటు కోళ్లను పెరట్లో పెంచేవారు. ఈ కోళ్లు అదనపు ఉపాధిని కలిగిస్తూ ఉండేవి. ప్రస్తుతం పల్లెల్లో నాటు కోళ్ల పెంపకం అక్కడక్కడా కొనసాగుతోంది. ఇదే సమయంలో నాటు కోళ్ల ఫారాలు అభివృద్ధి చెందుతున్నాయి. వాటి ఆరోగ్యం గురించి గ్రామీణ ప్రజలకు అవగాహన చాలా తక్కువ. సాధారణంగా నాటు కోళ్లకు సోకే వ్యాధి ఒకటి వస్తే, ఆ ప్రాంతంలో దాదాపు 80 నుంచి 90 శాతం నాటు కోళ్లు తుడిచి పెట్టుకుపోతాయి. అటువంటి వ్యాధుల్లో కొక్కెర వ్యాధి ఒకటి. ఈ వ్యాధిని గుర్తించి, టీకాలు వేయిస్తే నివారించొచ్చు. అలాగే నాటు కోళ్లల్లోనే కాకుండా లేయర్ కోళ్లల్లో కూడా కొక్కెర వ్యాధి వ్యాపిస్తుంది. వ్యాధి సోకితే నాటు కోళ్లు, లేయర్ కోళ్ల ఫారాల్లో అధిక సంఖ్యలో కోళ్లు మృత్యువాతకు గురవుతాయి.

కొక్కెర వ్యాప్తి ఇలా..

కొక్కెర వ్యాధి పారా మిక్సో వైరస్ వల్ల వ్యాపిస్తుంది. ఈ వైరస్ గాలి ద్వారా సోకుతుంది. వ్యాధి సోకిన కోళ్లు వేసే రెట్టలు, వాటి కళ్ల నుంచి కారే నీరు, చొంగ వల్ల కూడా వ్యాధి వ్యాప్తి చెందుతుంది. ముఖ్యంగా నాటు కోళ్లు, పిచ్చుకలు కూడా వైరస్‌ను రవాణా చేసే వాహకాలుగా పని చేస్తాయి. గ్రామీణ ప్రాంతాల్లో కోళ్లు ఊరంతా తిరుగుతూ ఉంటాయి. రాత్రి సమయంలో వీటికి ఒకే చోట వసతి కల్పిస్తుండటం వల్ల వ్యాధి సోకితే వారం రోజుల్లో ఆ ఇంటిలోని కోళ్లన్నింటికీ వ్యాధి వ్యాపిస్తుంది. అధిక సంఖ్యలో కోళ్లు మృత్యువాత పడతాయి. శరీరంలోని అన్ని అవయవాలపై వైరస్ ప్రభావం చూపుతుంది. శ్వాస వ్యవస్థ, జీర్ణ వ్యవస్థ, నాడీ వ్యవస్థ ప్రధానంగా ప్రభావితం అవుతాయి. వైరస్ ఇంక్యుబేషన్ కాలం 5 నుంచి 7 రోజుల మధ్య ఉండి, 10 నుంచి 14 రోజుల్లో వ్యాధి బహిర్గతమవుతుంది.

వ్యాధి లక్షణాలు

- ఆకుపచ్చ నీళ్ల విరేచనాలు
- మేత, నీరు తీసుకోవు.
- దగ్గు, గురక, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది
- కళ్లు, ముక్కు నుంచి నీరు కారటం
- జుట్టు నల్లబడి, నరాల బలహీనతతో వణుకుతాయి
- రెక్కలు వాలిపోతాయి. కాళ్లు, మెడ వంకర్లు పోతాయి.
- పక్షవాతంతో కోళ్లు చనిపోతాయి.

నివారణ ఇలా..

ఈ వ్యాధి సీజన్ మారే సమయంలో ఎక్కువగా వ్యాప్తి చెందుతుంది. అంటే వేసవి నుంచి వర్షాకాలం, వర్షాకాలం నుంచి శీతాకాలం ఇలా కాలాలు మారే సమయంలో ఉధృతంగా ఉంటుంది. వ్యాధి సోకిన తరువాత చేసే చికిత్స కన్నా, నివారణే ముఖ్యం. వ్యాధి నివారణకు టీకాలు వేస్తారు. ప్రతి ఏటా నవంబర్, డిసెంబర్ నెలల్లో వ్యాధి నివారణ టీకాలు వేయించడం ఉత్తమం. నివారణ టీకాలు ఒక పద్ధతి ప్రకారం చేస్తారు. మొదటగా వారం లోపు పిల్లలకు కొక్కెర తెగులు టీకాను ముక్కులో గాని, కంట్లో గాని వేయాలి. తిరిగి అదే మందును 8 వారాల తరువాత వేసి, ఆ తరువాత ప్రతి సంవత్సరం కొనసాగిస్తే వ్యాధిని పూర్తిగా నిర్మూలించవచ్చు.

టీకాలు తప్పనిసరి



50 పైసలు వెచ్చించి మార్కెట్‌లో లభించే టీకాలు వేయిస్తే కోళ్లను కొక్కెర వ్యాధి నుంచి కాపాడవచ్చు. పశు వైద్యశాలలో కూడా కొక్కెర వ్యాధి టీకాలు ఉచితంగా అందిస్తారు. సాధారణంగా ప్రతి సంవత్సరం పశువైద్య సిబ్బంది గ్రామాల్లో కొక్కెర వ్యాధి టీకాలు ఉచితంగా వేస్తారు. ఈ టీకాలను సామూహికంగా ఊళ్లో ఉన్న కోళ్లన్నింటికీ వేయించడం మేలు. డ్వాక్రా గ్రూపులు, మహిళా సంఘాలు ఈ కార్యక్రమాలను చేపట్టవచ్చు. ఈ విధంగా నాటు కోళ్లకు కొక్కెర వ్యాధి నివారణ టీకాలు వేయించడం ద్వారా వ్యాధిని అదుపులో ఉంచుకోవచ్చు.

– బీఆర్ శ్రీనివాసన్, పశువైద్యాధికారి

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	48	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	60
వంకాయలు (కాంతులు)	28	బీన్సచిక్కుడు	152
వంకాయలు (తెలుపు)	30	చామదుంపలు	36
బెండకాయలు	34	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	50	కంద	48
కాకర కాయలు	30-40	బీట్‌రూట్	38
బీరకాయలు	24	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	34	ఫ్రెంచ్‌బీన్స్	90
క్యాబేజీ	26	అల్లం	68-86
క్యారెట్	40	కొత్తిమీర (కట్ట)	20
దొండకాయలు	40	పాలకూర	12
బంగాళదుంపలు	32	తోటకూర	10
ఉల్లిపాయలు	25	చుక్కకూర	12
గోరుచిక్కుడు	40	గోంగూర	07-10
దోసకాయలు	20	పుదీనా	05
ఆనపకాయ (1)	20-30	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	19
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	30
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	33
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	07
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	11
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	30
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	07
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	25
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	27
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	22
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	22
ఏలూరు - తిరుపతి	16.00	4830	34

ఘనంగా గోర్ బంజారా తీజ్ పండుగ


గోర్ బంజారా తీజ్ పండుగ నిర్వహిస్తున్న భక్తులు

జంగారెడ్డిగూడెం: బంజారా భజరంగీ భేరి సంఘం ఆధ్వర్యంలో గోర్ బంజారా జాతి పెళ్లి కాని ఆడ పిల్లలు తొమ్మిది రోజుల పాటు ఘనంగా చేసుకునే తీజ్ పండుగను టి.నర్సాపురం మండలం కృష్ణాపురం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ ప్రధాన కార్యదర్శి భూక్యా వేణు గోపాల్ మాట్లాడుతూ గ్రామాలు పాడి పంటలు, సిరి సంపదలతో అభివృద్ధి చెందాలని కోరుకుంటూ భక్తి శ్రద్ధలతో మేరామా, తులజా, సీతలా, హింగ్లా మొదలగు ఏడుగురు భవానీలను పూజిస్తూ గోర్ బంజారా ఆడ పిల్లలు చేసుకునే పండుగ తీజ్ అన్నారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు మూడు శ్రీనివాస్ నాయక్, సంఘ కోశాధికారి ధరావతు రవి నాయక్, దేశావత్ వెంకట్ పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

పెదవేగి: కోడి పందాల శిబిరంపై దాడి చేసిన పోలీసులు 11 మందిని అరెస్ట్ చేశారు. ఎస్సై కె.రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం రాయన్నపాలెం గ్రామంలో కోడిపందాలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో ఎస్సై తన సిబ్బందితో దాడి చేసినట్లు తెలిపారు. ఈ దాడిలో 11 మందిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.24,480 నగదు, 3 పందెం కోళ్లు, 5 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదవేగి: మండలంలోని గుడిగుంట సబ్ స్టేషన్ నుంచి ముండూరుకు వెళ్లే లైన్ ఆర్‌డీఎస్‌ఎస్ పథకంలో కొత్త లైన్ ఏర్పాటు నిమిత్తం ఈ నెల 9న శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని విద్యుత్ శాఖ ఈఈ కేఎం అంబేడ్కర్ తెలిపారు. వ్యవసాయానికి ఉదయం 3 నుంచి10 గంటలవరకు, రాత్రి 10 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని తెలిపారు. అదే విధంగా కొప్పాక సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని ఆయన తెలిపారు.

నూతన కమిటీలతో వైఎస్సార్ సీపీ బలోపేతం


లింగపాలెంలో క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

లింగపాలెం: వైఎస్సార్ సీపీ బలోపేతానికి నూతనంగా కమిటీలు కృషి చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షులు అన్నపనేని శాంతరావు అన్నారు. శుక్రవారం నరసన్నపాలెం గ్రామంలో ఎంపీపీ ముసునూరి వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు ముసునూరి వెంకటేశ్వరరావు ఇంటి వద్ద గ్రామ పార్టీ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కుక్కపల్లి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శులుగా కొత్తా రామ్మోహనరావు, తాతిన ఫణీంద్ర, ముసునూరి కృష్ణారావు, రాయపాటి ధనుంజరావు, కార్యదర్శులుగా నంద్యాల రాములు, జొన్నకూటి నాగరాజు, కల్లేపల్లి రాంబాబు, లోచర్ల శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

భోగోలు గ్రామ కమిటీ ఎన్నిక

వైఎస్సార్ సీపీ భోగోలు అధ్యక్షుడిగా ఇనుగంటి చిన రంగారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శులుగా బడుగు మునుస్వామి, పాతనూరి మోహన్‌రావు, ఆచంట నాగేశ్వరరావు, తాళ్లూరు సురేష్, కార్యదర్శులుగా పంది కృష్ణమూర్తి, పలగాని చెన్నారావు, మద్దిపాటి శ్రీనివాసరావు, దాసరి బాలకృష్ణలు ఎన్నికయ్యారు.

రంగాపురం గ్రామ కమిటీ ఇలా..

పార్టీ రంగాపురం అధ్యక్షుడిగా ఓబిళ్లనేని శేషగిరిరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పార్టీ సినియర్ నాయకులు, మాజీ సొసైటీ అధ్యక్షుడు రెడ్డిన శ్రీను ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఓబిళ్లనేని శేషగిరిరావు, ప్రధాన కార్యదర్శులుగా గుళ్లపూడి సత్యనారాయణ, కూరాకుల శ్రీనివాసరావు, గరికిపూడి శ్రీనివాసరావు, అంగడాల రాటాలు, కార్యదర్శులుగా మాదాసి లక్ష్మీన్నారాయణ, బేతు నవీన్, కాట్రు ఆదాము, కాటు ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పార్టీ తాడిచర్ల గ్రామ కమిటీ నియామకం

కామవరపుకోట: మండలంలోని తాడిచర్ల గ్రామ వైఎస్సార్ సీపీ కొత్త కమిటీని ఎన్నుకున్నారు. కామవరపుకోట సొసైటీ మాజీ అధ్యక్షుడు సాయిన కనకరాజు, టౌన్ కన్వీనర్ నానాది సాగర్, మేడంకి విజయరావు ఆధ్వర్యంలో పార్టీ మండల అధ్యక్షుడు రాయంకుల సత్యనారాయణ కమిటీని ప్రకటించారు. పార్టీ తాడిచర్ల గ్రామ కమిటీ అధ్యక్షుడిగా మిడతా మారయ్య, ప్రధాన కార్యదర్శులుగా గుడెల్లి జోజి, గుల్లా మంగరాజు, తలపాడల శ్రీను, జోనుబోయిన రాంబాబు, కార్యదర్శులుగా నల్ల మోతుల సత్యనారాయణ, పోతునూరి మాణిక్యాలరావు, చింతపల్లి సత్యనారాయణ, దాసరి రామకృష్ణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వేగం వద్దు.. ప్రాణం ముద్దు

భీమడోలు: వేగం వద్దు.. ప్రాణం ముద్దు అనే నినాదంతో ప్రతి ఒక్కరూ తమ గమ్య స్థానాలకు అరగంట అలస్యంగా వెళ్లినా ఎటువంటి నష్టం ఉండదని సీఐ యూజే విల్సన్ అన్నారు. జాతీయ రహదారిపై భీమడోలు సర్కిల్ పరిధిలో ప్రమాదాలకు కారణమైన బ్లాక్ స్పాట్లను గుర్తించిన పోలీస్ యంత్రాంగం ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్ ఆదేశాల మేరకు శుక్రవారం సాయంత్రం ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. భీమడోలు, ద్వారకాతిరుమల ఎస్సైలు వై.సుధాకర్, సుధీర్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రజ్ఞా, హైవే ఇంజనీర్ నాగేశ్వరరావులతో కలిసి ఆయన గుండుగొలను, సూరప్పగూడెం, అంబర్‌పేట, భీమడోలు, పాతూరు, కురెళ్లగూడెం, పూళ్ల తదితర బ్లాక్ స్పాట్లను పరిశీలించారు. ఇక్కడ ఇంజినీరింగ్ లోపాలు అసమాన ఉపరితలాలు, డివైడర్లు లేకపోవడంతో తదితర అంశాలు ప్రమాదాలకు కారణంగా గుర్తించారు.